# కోటప్పకొండ తిరునాళ్లకు ముస్తాబు



కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఫిబ్రవరి 15న జరగనుంది. నరసరావుపేట పట్టణ సుందరీకరణ పనుల కోసం రూ. 50 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తెలిపారు.
సోమవారం పట్టణంలో పెయింటింగ్ పనులను ఆయన స్వయంగా ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పండుగ వాతావరణం తీసుకువస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# మహిళా సాధికారతకు 'చేయూత'582 మంది మహిళా సంఘాలకు 1,91,83,496 రూపాయుల చెక్కు అందజేత..

**-కామారెడ్డిలో వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం**
**-ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



గాయత్రి వార్తలు
కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియం సోమవారం ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని మహిళలకు చెక్కులు, చీరలు పంపిణీ చేశారు.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం మహిళా లోకంలో నూతన ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమం లో 582 స్వయం సహాయక సంఘాలకు మొత్తం రూ.1,91,83,496/- (ఒక కోటి 91 లక్షల 83 వేల 496 రూపాయలు) విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,"మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతి కుటుంబానికి వెన్నెముక మహిళే. ఒక ఇంటి అభివృద్ధి ఆ ఇంటి మహిళ ఆర్థిక స్థితిగతుల పైనే ఆధారపడి ఉంటుంది. అందుకే మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోందన్నారు.ఈ నిధులను మీ చిన్న వ్యాపారాలకు, పిల్లల భవిష్యత్తుకు పెట్టుబడిగా మలచుకోవాలి. గతంలో వడ్డీలు కట్టలేక మహిళా సంఘాలు ఎదుర్కొన్న ఇబ్బందులు నాకు తెలుసు. కానీ ఇప్పుడు అలాంటి భయం అవసరం లేదు. పైసా వడ్డీ లేకుండా ప్రభుత్వం మీకు అండగా నిలుస్తోంది.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలి. మహిళా సాధికారత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదు. మెప్మా ద్వారా ఇలాంటి మరిన్ని పథకాలను నేరుగా మీ దరికి తీసుకొస్తాం. కామారెడ్డిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతాం," అని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ,"ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సరైన మార్గంలో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా స్థిరపడాలి. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని నిధులు పొందే అవకాశం ఉంటుంది. జిల్లా యంత్రాంగం మహిళా సంఘాల బలోపేతానికి ఎల్లప్పుడూ సహకరిస్తుంది, అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఎమ్మార్వో, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధి పొందిన మహిళలు ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రభుత్వ సలహాదారులు, కలెక్టర్ గార్లకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.

# గణతంత్ర వేడుకలకు సిద్ధం కావాలి



గుంటూరు: జనవరి 19 గాయత్రి వార్తలు
గణతంత్ర వేడుకలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 77వ గణతంత్ర వేడుకలపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలు తుళ్లూరు మండలం రాయిపూడిలో జరుగుతున్నాయని అన్నారు. ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించుటకు అందరు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. సిఆర్ డిఎ, శాఖల ప్రధాన కార్యాలయాలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆయా శాఖలకు సూచించిన మేరకు శాఖల అభివృద్ధిని తెలియజేసే శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తాగు నీరు, పారిశుధ్యం పక్కా ఉండాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, శ్రీనివాస్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రక్రియ మహిళలకు చీరల పంపిణీ వేగవంతం చేయాలి..



గాయత్రి వార్తలు
వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రక్రియ , మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక పథకాల ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో వడ్డీ లేని రుణాల పథకంలో భాగంగా పట్టణ మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సి ఈ ఓ దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.స్వయం సహాయక సంఘం మహిళ లకు, సంఘాలలో సభ్యులుగా లేని వారిని రేషన్ కార్డు ఆధారంగా గుర్తించాలని, పంపిణీ కార్యక్రమంలో రద్దీ లేకుండా చూడాలని తెలిపారు.అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మంగళవారం రేపు ఎల్లారెడ్డి, బిచ్కుంద లో చీరల పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసి పంపిణీ ప్రక్రియ లో రద్దీ లేకుండా జాగ్రత్తలు పాటించి విజయవంతం చేయాలని అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ మధు మోహన్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరం




పెదకూరపాడు :75 తాళ్లూరు గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. 59 ఎద్దులు,350 సూడి గేదలకు నట్ట నివారణ ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించామని డాక్టర్ శివకుమారి తెలిపారు. జనవరి 13 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కొల్లి బ్రహ్మారెడ్డి కల్లం సుందర్ రామిరెడ్డి వైద్య సిబ్బంది చంద్రం పాల్గొన్నారు.




# దండిగా డబ్బులు వసూలు అభివృద్ధి చూస్తే శూన్యం

**- అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ లో తెలంగాణ టూరిజం**



గాయత్రి వార్తలు
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో పర్హాబాద్ దగ్గర నుంచి తెలంగాణ టూరిజం పేరుతో ప్రభుత్వం టైగర్ సఫారీ ఒక్క ట్రిప్ కి 3000/- చెల్లించి మరియు గైడ్ కి 200/- అడవిలో ఉన్న వన్య ప్రాణులను ప్రకృతి అందాలను అన్నింటిని చూపిస్తామంటూ దండిగా డబ్బులను వసూలు చేస్తున్నారు. సందర్శకులకు టైగర్ రిజర్వు ఫారెస్టు అని చెప్పి కనీసం చిన్న చిన్న వన్య ప్రాణాలను కూడా చూపించడం లేదని సందర్శకులు వాపోతున్నారు. తెలంగాణ టూరిజం అని పేరుకు మాత్రమే ఒక్క పూట తిండి పెట్టేది పక్కకు పెడితే కనీసం తాగడానికి నీరు లేక మరియు మహిళలకు బాత్రూమ్స్ కూడా సరిగ్గా లేవని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అడవిలో ఉన్న వన్య ప్రాణులకు తాగడానికి నీటి సదుపాయం కూడా లేదనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఎన్ని వచ్చినా ఇక్కడ మాత్రం అభివృద్ధి శూన్యం అని చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమా? అటవీ అధికారుల నిర్లక్ష్యమా? లేదా రాజకీయ నాయకుల అండదండలతో నడిపిస్తున్నారా అని ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలకు భరోసా..

**- బిచ్కుందలో ఇందిరమ్మ చీరల పంపిణీ**



గాయత్రి వార్తలు
మహిళల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం కింద బిచ్కుంద మండల కేంద్రంలో మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
బిచ్కుంద మండల కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో, జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మహిళలకు స్వయంగా ఇందిరమ్మ చీరలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళల ఆర్థిక-సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం మహిళలకు ఆత్మవిశ్వాసం, స్వావలంబన కల్పించే కీలక పథకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**- ICDS సూపర్ వైజర్ పార్వతి**



గాయత్రి వార్తలు
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఉదయం ICDS సూపర్ వైజర్ పార్వతి సందర్శించారు. గ్రామంలో గర్భవతి గా ఉన్న మహిళలు, బాలింత తల్లులకు మరియు చిన్న పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ల తో మాట్లాడి ఆహార సరఫరా మరియు ఆరోగ్య పర్యవేక్షణ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన్నెవారిపల్లి గ్రామ సర్పంచ్ సభావట్ సునీత గురునాయక్ అంగన్వాడీ కేంద్ర అభివృద్ధి కి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు నాయకులు పాల్గొని సర్పంచ్ ని అభినందించారు.

# అతిరథి వేడుకలు మొదలయ్యేది అప్పుడే!



మలయాళ కథానాయకులు టొవినో థామస్, బసిల్ జోసెఫ్, వినీత్ శ్రీనివాసన్ కలిసి 'అతిరథి' సినిమాతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నారు. అరుణ్ అనిరుధన్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. దీన్ని ఓనం పండగ సందర్భంగా తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఈ చిత్రాన్ని అనుకున్న తేదీ కన్నా ముందుగానే థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను పంచుకుంది. "వేడుకలు ఇప్పుడు మొదలవుతున్నాయి.. మే 14న బాణసంచా పేలబోతుంది" అనే వ్యాఖ్యను జోడించింది. డా.అనంతు ఎస్, బసిల్ జోసెఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శన రాజేంద్రన్, జరీన్ షిహాబ్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. కాలేజీ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# బాలీవుడ్‌పై రెహమాన్ కామెంట్స్.. స్పందించిన ప్రముఖులు



బాలీవుడ్ గురించి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వ్యక్తం చేసిన అభిప్రాయంపై దుమారం రేగుతోంది. దీనిపై ప్రముఖులు స్పందిస్తున్నారు. 'అవి డేంజరస్ కామెంట్స్' అని రచయిత్రి శోభా డే మండిపడగా.. రెహమాన్ ఇలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వడాన్ని తాను నమ్మలేకపోతున్నానని, ఆయన వ్యాఖ్యలను కొందరు అపార్థం చేసుకొని ఉండొచ్చని ప్రముఖ స్క్రీన్ రైటర్ జావేద్ అక్తర్ అన్నారు.

"రెహమాన్‌కు బాలీవుడ్‌లో వర్క్ లేకపోవడానికి కారణం మతం కాదు. ముంబయిలో నాకు తెలిసిన చాలామందికి రెహమాన్‌పై గౌరవం ఉంది. అంతర్జాతీయ ప్రాజెక్టులతో ఆయన బిజీగా ఉంటున్నారని, విదేశాల్లో ఆయన నిర్వహించే ప్రోగ్రామ్స్ ఎక్కువ సమయం తీసుకుంటున్నాయని, అందుకే తమ ప్రాజెక్టులకు ఆయన అందుబాటులో ఉండరేమో అని ఇక్కడ మేకర్స్ అనుకోవచ్చు. పైగా తొలి నుంచి రెహమాన్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్. అందుకే చిన్న నిర్మాతలు ఆయన్ను సంప్రదించలేకపోవచ్చు. కమ్యూనిటీ కారణంగానే ఆయనకు అవకాశాలు తగ్గుతున్నాయనే దాన్ని నేను నమ్మను" అని జావేద్ పేర్కొన్నారు. ఇదే అంశంపై సింగర్ షాన్ మాట్లాడుతూ.. "ఇక్కడ మతపరమైన కోణం ఉందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అదే కారణమైతే.. కొందరు హీరోలు ఇప్పుడు స్టార్ హీరోలుగా ఉండేవారు కాదు కదా" అని అభిప్రాయపడ్డారు.

**రెహమాన్ ఏమన్నారు?**

రెహమాన్ ఇటీవల ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో 'బాలీవుడ్‌లో తమిళ్ లేదా మహారాష్ట్రేతరులపై పక్షపాతం ఉంటుందా?' అని ప్రశ్నించగా.. వ్యక్తిగతంగా తానెప్పుడూ ఎలాంటి వివక్షను ఎదుర్కోలేదని తెలిపారు. "ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో 'పవర్ షిఫ్ట్' నెలకొంది. సృజనాత్మకత లేని వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనికి మతపరమైన అంశం ఓ కారణమై ఉండొచ్చు. అది నాకు నేరుగా ఎదురుకాలేదు గానీ.. గుసగుసలు వినిపించాయి. నేను పని కోసం వెతకను. చిత్తశుద్ధి ఉంటే పనే మన వద్దకు వస్తుందని విశ్వసిస్తా" అని రెహమాన్ అన్నారు.

# బాలీవుడ్‌లో మరొకటి?



'పరాశక్తి' సినిమాతో ఈ ఏడాదికి స్వాగతం పలికింది అందాల తార శ్రీలీల. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా అలరిస్తున్న ఈ భామ.. హీరో కార్తిక్ ఆర్యన్‌తో ఓ హిందీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో బాలీవుడ్ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణంలో రూపొందుతున్న చిత్రం 'నాగ్జిల్లా'. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసిందట చిత్రబృందం. ఫాంటసీ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కూడా కార్తిక్ ఆర్యనే హీరో కావడం విశేషం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. శ్రీలీల, కార్తిక్ కాంబినేషన్‌లో ఇది రెండో సినిమా అవుతుందని నిర్మాణ సంస్థ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి తన డ్యాన్స్‌లతో తెరపై మ్యాజిక్ చేసే శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి నాగలోకంలో ఎలాంటి హంగామా చేస్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# తిరుమలకు సినీ నిర్మాత బండ్ల గణేశ్ పాదయాత్ర

సినీ నిర్మాత బండ్ల గణేశ్ తిరుమలకు పాదయాత్ర చేపట్టనున్నారు. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అరెస్టైన సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకుంటానని ఆయన తెలిపారు. ఈనెల 19న ఉదయం 9 గంటలకు షాద్‌నగర్‌లోని తన నివాసం నుంచి 'సంకల్ప యాత్ర' ప్రారంభిస్తానని బండ్ల గణేశ్ వెల్లడించారు.

"మన నాయకుడు, దేశం గర్వించే దార్శనికుడు చంద్రబాబుపై వేసిన అభాండాలు తొలగిపోవాలని.. జైలు నుంచి ఆయన బయటకు రావాలని సుప్రీంకోర్టు గడపపై నిలుచుని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించా. 'నా గడప నుంచి నీ కొండ దాకా పాదయాత్ర' చేస్తానని మొక్కుకున్నా. ప్రతి తెలుగువాడి ప్రార్థనలతో చంద్రబాబు మళ్లీ అఖండ విజయంతో పూర్వ వైభవాన్ని సాధించుకున్నారు. ఇటీవలే కేసులన్నీ కొట్టేశారు. దీంతో నా మనసు కుదుటపడింది. నా కుటుంబం మొక్కు గుర్తు తెచ్చుకుంది. అందుకే అమ్మానాన్నల ఆశీర్వాదాలతో షాద్‌నగర్‌లోని మా ఇంటి గడప ముందు కొబ్బరికాయ కొట్టి పాదయాత్ర ప్రారంభిస్తాను. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో కొండకు చేరి దర్శనం చేసుకుంటాను. ఇది రాజకీయ యాత్ర కాదు. నా మనోవేదన తీర్చిన, నా కోరిక నెరవేర్చిన, నా మాట ఆలకించిన ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి నా మొక్కుబడి చెల్లింపు" అని బండ్ల గణేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# సంక్రాంతి సినిమాలు..

## వీరికి 'డబుల్ ధమాకా'.. గమనించారా?





ఎప్పటిలాగే ఈ సంక్రాంతికీ పెద్ద హీరోల సినిమాలతోపాటు చిన్న చిత్రాలు విడుదలై, ప్రేక్షకులకు వినోదాన్ని పంచాయి విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి. కొందరు నటులు, ఓ సంగీత దర్శకుడు వీటిలో రెండ్రెండు సినిమాలకు వర్క్ చేయడం విశేషం. వారెవరంటే..?

జరీనా వహాబ్: 'ది రాజాసాబ్'లో హీరో ప్రభాస్‌కు నానమ్మగా నటించిన ఆమె .. 'మన శంకరవరప్రసాద్ గారు'లో కథానాయకుడు చిరంజీవికి తల్లిగా కనిపించారు.

బుల్లిరాజు: 'సంక్రాంతి వస్తున్నాం'లో నటించిన బాల నటుడు రేవంత్.. బుల్లిరాజు గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. 'మన శంకరవరప్రసాద్ గారు', నవీన్ పొలిశెట్టి హీరోగా తెరకెక్కిన 'అనగనగా ఒక రాజు' లోనూ అతడు నవ్వులు పూయించాడు.

ఈ ముగ్గురు ఇలా: 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' శర్వానంద్ హీరోగా తెరకెక్కిన 'నారీ నారీ నడుమ మురారి'లో సునీల్, సత్య, వెన్నెల కిశోర్‌లు సందడి చేశారు. సత్య 'ది రాజాసాబ్'లోనూ కనిపించారు.

భీమ్స్: 'మన శంకరవరప్రసాద్ గారు', రవితేజ హీరోగా రూపొందిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాలకు మ్యూజిక్ అందించి ప్రేక్షకుల్ని అలరించారు.

# ఆ గౌరవాన్ని అంత తేలికగా తీసుకోలేను!



వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ హీరో విక్రాంత్ మాస్సే. 'ట్వెల్త్ ఫెయిల్' చిత్రానికి గానూ జాతీయ స్థాయిలో నిలిచిన ఈయన.. ఆ గౌరవాన్ని అంత తేలికగా తీసుకోలేనని అంటున్నారు. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న విక్రాంత్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును గెల్చుకున్న క్షణాల్ని గుర్తుచేసుకున్నారు. "ఇది నేను చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల. 2004లో నేను కెరీర్‌ను ప్రారంభించా. అప్పుడు నటన గురించి నాకేమీ తెలియదు. రోజులు గడుస్తున్నకొద్దీ ఈ కళను నేర్చుకోవడం ప్రారంభించాను. నా జీవితమంతా కెమెరా ముందు గడపాలని తెలుసుకున్నా. ఎందుకంటే కథలు చెప్పడం, ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం నాకు నిజంగా నచ్చిన విషయం. జాతీయ అవార్డు కేవలం ఒక వేడుక లాంటి క్షణం కాదు.. బాధ్యతను గుర్తుచేస్తుంది. గుర్తింపుతో వచ్చే బరువు ఇది. ప్రతి నటుడు తన సినిమాను ప్రశంసించాలని కలలు కంటాడు. ఆ కల నిజమైనప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. అలాగే మీరు మరింత కష్టపడి మెరుగ్గా పని చేయాల్సిన బాధ్యత కూడా ఉంటుంది" అని అన్నారు విక్రాంత్ మాస్సే.

# ధనుష్ కొత్త సినిమా..

## రూ.84 కోట్ల నష్టపరిహారం కోరిన ఇరోస్



ధనుష్ కృతి సనన్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'తేరే ఇష్క్ మే' తెలుగులో అమరకావ్యం). గతేడాది నవంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 23 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి చిక్కులు ఎదురయ్యాయి. గతంలో తాము నిర్మించిన హిట్ మూవీ 'రాంఝనా' కు సీక్వెల్ అని 'తేరే ఇష్క్ మే'ను ప్రచారం చేశారని, దానికి తమ అనుమతి తీసుకోలేదని ఇరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఆరోపించింది. ఈ మేరకు బాంబే హైకోర్టును ఆశ్రయించింది. నిర్మాణ సంస్థ 'కలర్ ఎల్లో', దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని, తమ ప్రతిష్ఠను దెబ్బ తీశారని, అందుకుగానూ రూ.84 కోట్లు నష్టపరిహారంగా ఇప్పించాలంటూ పిటిషన్ దాఖలు చేసింది. 'రాంఝనా'లోని కొన్ని పాత్రలు 'తేరే ఇష్క్ మే'లో కొనసాగాయని పేర్కొంది.

'రాంఝనా' కూడా ధనుష్- ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో రూపొందిందే. 2013లో విడుదలై హిట్ అందుకున్న ఈ మూవీ గతేడాది రీ-రిలీజ్ అయింది. విషాదాంతం ఉన్న ముగింపును భిన్నంగా మార్పు చేసి సినిమా ఆత్మనే దెబ్బతీశారంటూ రీ-రిలీజ్ అనంతరం ఇరోస్‌పై ధనుష్, ఆనంద్ ఎల్. రాయ్ అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము ధనుష్ టీమ్ నేరుగా సంప్రదించామని, విడుదలకు ముందు వారు అభ్యంతరం తెలపలేదంటూ అప్పుడు ఇరోస్ చెప్పడం గమనార్హం.

# 'తుడరుమ్' దర్శకుడితో మరోసారి?



గతేడాది 'తుడరుమ్' సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. దర్శకుడు తరుణ్ మూర్తి తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆయన ట్యాక్సీ డ్రైవర్‌గా కనిపించి సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. తాజాగా మోహన్‌లాల్ తన రాబోయే ప్రాజెక్టు కోసం మరోసారి తరుణ్ మూర్తితో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. 'ఎల్365' (వర్కింగ్ టైటిల్) పేరుతో దీన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెల 23న చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని, ఇప్పుడు రాబోయే చిత్రాన్ని మునుపటి కన్నా భారీగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్లు మోహన్‌లాల్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన 'దృశ్యం 3', 'పేట్రియాట్' లాంటి సినిమా చిత్రీకరణలతో బిజీగా ఉన్నారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.